# నవ్యరాగాలు

-గొర్రెపాటి శ్రీను

టైమ్ చూసుకున్నాను.

సాయంత్రం ఆరుగంటలకల్లా ట్యాంక్‌బండ్‌పై వుంటానని, రుద్రమదేవి విగ్రహం దగ్గర కూర్చుని ఎదురుచూస్తుంటాను, తప్పకుండా ఆలస్యం అవకుండా రండని ఆనంద్‌కి చెప్పాను. వచ్చి ఉంటాడేమో? అనుకుంటూ ఉండగా సిటీబస్ ట్యాంక్‌బండ్‌పై ఆగింది.

కిక్కిరిసిన బస్‌లోని జనాల్ని దాటుకుంటూ కిందకి దిగి 'హమ్మయ్య' అంటూ నిట్టూర్చి చుట్టూ పరిశీలనగా చూసాను. దూరంగా ఆనంద్ కనిపించాడు.

''సారీ ఆనంద్! పది నిముషాలు ఆలస్యం అయింది. ఆఫీస్‌లో వర్క్ లోడ్ హెవీగా వుండడంవల్ల ఆగిపోవాల్సి వచ్చింది'' అన్నాను మెల్లగా అతనితో.

అతడి రెస్పాన్స్ ఎలా వుంటుందోనని మొహంలోకి తొంగి చూసాను నన్ను పట్టించుకోకుండా అతడెటో చూస్తుంటే... ''హాయ్ ఆనంద్! హౌఆర్ యూ'' అంటూ చిరునవ్వుతో పలకరించాను.

సమాధానంగా చిన్నగా నవ్వాడు.

''హౌ ఆర్ యూ!'' అంటూ నన్ను ప్రశ్నించాడు.

''ఐయామ్ ఫైన్'' అన్నాను అతడి పక్కనే కూర్చుంటూ.

''జంట చూడముచ్చటగా వుందిరా'' అనుకుంటూ వెళ్లిపోతున్నారెవరో మమ్మల్ని చూస్తూ.

''ఆలస్యంగా వచ్చినందుకు మీరేమీ ఫీల్ అవలేదు కదా!''

''అవున్లే మీరు చాలా బిజీ కదా'' అన్నాను వ్యంగ్యంగా.

అతడి ప్రవర్తన నాకేమీ కొత్తగా అనిపించలేదు. మామూలుగా అడిగాను ''ఇంటర్వ్యూ ఏమైంది?''

''ఆ... ఏం ఇంటర్వ్యూలే? అన్ని ఇంటర్వ్యూలలాగే జరిగింది. ఆఫీస్ అడ్రస్ వెతకడానికి చాలా టైమ్ అయింది: తీరా లోనికి వెళ్లగానే నా పేరే పిలిచారు. ఎన్నో ప్రశ్నలు అడిగారు. అన్నటికీ ఓపిగ్గా సమాధానాలు చెప్పాను. నేను సెలెక్ట్ అయ్యానో లేదో? నెలరోజులు ఆగి తెలియజేస్తారట! చూస్తుంటే ఈ జాబ్ వచ్చేలా లేదు. ఇది నా ఆరో ఇంటర్వ్యూ. ఇలా ఇంకా ఎన్ని ఇంటర్వ్యూలు ఫేస్ చేయాలో? నాకు ఉద్యోగం వస్తుందన్న ఆశ రోజురోజుకూ తగ్గిపోతోంది. ఈ సెకండ్ క్లాస్ డిగ్రీ నాకు ఉద్యోగం ఎప్పుడు సంపాదించి పెడుతుంది?'' అన్నాడు నిరాశ నిండిన స్వరంతో.

''ఎందుకలా నిరాశకు లోనవుతారు?''

''అవక ఏం చేయమంటావ్? పొద్దుట చార్జీల కోసం, పాకెట్ ఖర్చులకోసం నాన్నను అడగాల్సి వచ్చింది. ఆయన్నలా డబ్బులు అడగడం చాలా సిగ్గుగా అనిపించింది. నాన్న మొన్న ఏమన్నారో తెలుసా? 'నీవంటి అసమర్థుడైన కొడుకుని కనడం కన్నా ఆడపిల్లని కన్నా దాచిన డబ్బులతో పెళ్లిచేసి అత్తవారింటికి పంపి హాయిగా బ్రతికేవాడ్ని. నిన్ను పోషించడం నావల్లకాదురా. వెళ్ళు. ఎక్కడికైనా వెళ్లి స్వంతంగా బ్రతకడం నేర్చుకో' అన్నారు. చూసావా నవ్యా! నేనంటే ఆయనకెంత చిన్నచూపో. అవున్లే నిరుద్యోగిని కదా. అందుకే నేనంటే అందరికీ చులకన'' అంటూ చెప్పడం ఆపేశాడు. ఇంక చెప్పడానికి గొంతు పెగల్లేదు. అతడి ప్రవర్తన, మాటలు చూసి జాలిపడాలో, ఆశ్చర్యపోవాలో అర్థంకాలేదు.

ఇక ఆ టాపిక్ మార్చాలి అనుకుంటూ ''ఐస్‌క్రీం తిందామా?'' అన్నాను.

''వద్దు'' అన్నాడు.

ఓ అయిదు నిముషాల తరువాత ''నీ దగ్గరవున్న ఫైవ్‌స్టార్ చాక్లెట్ తిందాం'' అంటూ బ్యాగ్ తెరవబోతూ ముందుకు వంగాడు. ''వన్ సెకండ్'' అంటూ బ్యాగ్‌లోంచి ఫైవ్‌స్టార్ తీసిచ్చాను.

''అన్నట్లు నీకు చెప్పడం మరిచపోయాను. చెల్లాయికి మ్యారేజీ సెటిల్ అయింది. అబ్బాయి టీచర్. గవర్నమెంట్ జాబ్. కట్నం లక్షన్నర. పెళ్లి వచ్చే మాఘమాసంలో'' అంటూ ఆనందంగా చెప్పాడు.

''శుభవార్త ఇంత ఆలస్యంగానా చెప్పేది. మీ చెల్లెలికి కంగ్రాట్స్ చెప్పు'' అన్నాను సంతోషంగా.

''అలా నడుస్తూ మాట్లాడుకుందామా?'' అంటూ అతడు అడిగేసరికి ఆనంద్‌ని అనుసరించాను. సంధ్యాసమయం. ఆకాశం అంతా ఎర్రని రంగు పులిమినట్లుంది. సూర్యుడు ఎర్రని బంతిలాగా కనిపిస్తున్నాడు. చల్లని పిల్లగాలులు వీస్తున్నాయి. ఆనంద్, నేనూ పక్కపక్కన నడుస్తున్నాము. మనస్సంతా హాయిగా వుంది. ఆనంద్ నా చేతిని తన చేతుల్లోకి తీసుకుంటూ ''అక్కడ కూర్చుందామా?'' అంటూ దూరంగా వున్న ఓ బెంచ్ చూపించాడు. ఇద్దరం కలసి అక్కడికి చేరుకున్నాం. అతడు బుద్ధుడి విగ్రహం వైపు చూస్తున్నాడు ఏదో ఆలోచిస్తున్నట్టుగా.

''ఎంఎ ఎగ్జామ్స్ ఎప్పుడు?''

''వచ్చేనెల. బాగా ప్రిపేర్ అవుతున్నాను.''

మళ్ళీ ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాడు.

'ఓ ఆడపిల్ల పక్కనుంటే ఎలా ప్రవర్తించాలో తెలియదు. అయినా నేను ఇతడ్ని ఎందుకు ప్రేమిస్తున్నాను?' అనుకున్నాను క్షణకాలం.

''నవ్యా! నువ్వు ఎప్పుడూ ఆనందంగా ఎలా ఉండగలుగుతావు. నీకెప్పుడూ టెన్షన్స్ ఉండవా?''

''ఎందుకుండవ్? వుంటాయి. కానీ నేను దేని గురించి ఎక్కువ డీప్‌గా ఆలోచించను. కానీ ఏదైనా అనుకున్నానంటే పట్టుదలగా ఆ పని చేస్తాను. నేను ఓ ప్రశ్న అడుగుతాను. మీరు కోపం తెచ్చుకోరు కదా!'' అంటూ అడిగాను.

''అడుగు నవ్యా'' అన్నాడు సందేహిస్తూనే.

''మీ చదువుకు తగ్గ ఉద్యోగమే కాకుండా ఏదో ఒక జాబ్ ఎందుకు చేయకూడదు'' బుల్లెట్‌లా దూసుకువచ్చిన ప్రశ్న విని కాస్త వెనక్కి జరిగి–

''చెయ్యాలనే ఉంది. కానీ అవకాశాలేవి?''

ఎన్నాళ్లుగానో చెప్పాలనుకున్న మాటలు ఇక లోపల దాగలేక హృదయంలోంచి పొంగుకువచ్చాయి.

''ఆనంద్! నేను ఇలా చెబుతున్నానని మీరు మరోలా భావించవద్దు. మీ హితవు కోరే ఈ మాటలు చెబుతున్నాను. ఉద్యోగమంటే ఆఫీస్‌లో వీల్‌ఛైర్‌లో ఏసి రూంలో ఓ కంప్యూటర్ ముందేసుకుని చేసేదే కాదు. డబ్బు వచ్చే గౌరవప్రదమైన పని ఏదైనా ఉద్యోగమే. అలాగని డిగ్రీ చదివిన మిమ్మల్ని రిక్షా లాగమనడంలేదు. చిన్నది పెద్దది అని చూడకుండా ఏదో ఒక జాబ్‌లో చేరిపోండి ముందు. తరువాత మంచి ఉద్యోగం గురించి ప్రయత్నించండి. అదే వస్తుంది. ఇలా ఆలోచిస్తూ కూర్చుంటే ఏళ్ళు గడిచిపోతాయే తప్ప ప్రయోజనం శూన్యం. ముందు మీ ఆలోచనా విధానంలో మార్పు తెచ్చుకోవడానికి ప్రయత్నించండి. ప్రతి సంఘటనను పాజిటివ్‌గా ఆలోచించండి. తప్పకుండా విజయం మీ స్వంతమవుతుంది.''

''నువ్వు చెప్పింది నిజమే'' అంటూ ఆహ్లాదంగా నవ్వాడు.

అతడి కళ్లల్లోకి సూటిగా చూస్తూ ''ఐ లవ్ ఆనంద్'' అంటూ అతని భుజంపై తల ఆనించి తృప్తిగా కళ్ళు మూసుకున్నాను తేలికబడ్డ మనస్సుతో.

''నీవు నాకు తోడుగా వుంటే చాలు నవ్యా! నేను ఏదైనా సాధించగలను. ఇక ముందెప్పుడూ ఓటమిని చూసి దడవను. భయపడను. వెనుకడుగు వేయను. ధైర్యంగా వాటిని ఎదుర్కొంటూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతాను. జీవితంలో ఎన్నో విజయాలు సాధిస్తాను'' అన్నాడు దృఢ నిశ్చయంతో.

• • •

''అలస్యమైందేమిటి?'' అంటూ ప్రశ్నించింది అమ్మ.

''అదీ...'' అంటూ ఆగిపోయాను.


''ఆనంద్‌ని కలిసి వస్తున్నావు కదూ''

''అవునమ్మా!''

''రేపు మీ నాన్నగారికి మీ విషయం చెబుతాను.''

''నేనే చెబుతాలే'' అంటూ బాత్రూం లోకి నడిచాను స్నానానికని.

రాత్రి ఎంత ప్రయత్నించినా నిద్ర రావడంలేదు. నాన్నగారు వచ్చినట్టున్నారు. ఆయనకిది మామూలే. అర్ధరాత్రి పన్నెండు గంటలప్పుడు వస్తారు. ఉదయం పదిగంటలకుగానీ నిద్ర లేవరు. ఆయన నేను కలుసుకునేది తక్కువ. కానీ ఆయనకి నేనంటే పంచప్రాణాలు. ఎందుకంటే నాకు ఆయనకు పోలికలు చాలా ఎక్కువ. ఇద్దరి ఆలోచనా విధానం, ప్రవర్తన... ఇలా ఇంకా ఎన్నో.



''నిద్ర పోలేదా నవ్యా?'' నాన్నగారు ప్రేమగా అడిగారు.

''లేదు డాడీ. ఇంకా నిద్ర పట్టలేదు''

''ఎందోరా ఈ రోజు నీతో మాట్లాడాలనిపిస్తోంది. రా... నేను భోజనం చేస్తుంటాను. నువ్వు మాట్లాడుదువుగానీ'' అంటూ పిలిచారు.

నేను బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని లేచి వెళ్ళి నాన్నగారు భోజనం చేస్తున్నంతసేపూ మాట్లాడాను.

''గుడ్‌నైట్'' అంటూ నాన్నగారు వెళ్ళిపోయారు.

నేను ఒంటరిగా మిగిలిపోయాను. ఎంతగా ప్రయత్నించినా నిద్ర రాలేదు.

ఆనంద్‌తో నా పరిచయం అయిన ఆ రోజు గుర్తుకు వచ్చింది.

• • •

ఆర్ట్ కాంపిటీషన్ జరుగుతోంది.

స్టేట్ లెవెల్లో జరుగుతున్న ఆ పోటీలకి ఎక్కడెక్కడి నుండో వచ్చారు. అందరూ పెయింటింగ్స్‌ని శ్రద్ధగా వేస్తున్నారు.

నేను రాధాకృష్ణుల పెయింటింగ్ వేస్తున్నాను. నా పెయింటింగ్ పూర్తయింది. అందరూ నేను వేసిన పెయింటింగ్ చాలా బాగుంది, ఫస్ట్ ప్రైజ్ ఈ అమ్మాయికే వస్తుందని అనుకుంటుంటే నాకు చాలా గర్వంగా అనిపించింది.

దాదాపుగా అందరూ నాకే ఫస్ట్‌ప్రైజ్ వస్తుంది అంటుంటే నా ఆనందానికి పట్టపగ్గాలు లేకుండాపోయింది.

బహుమతులు ప్రకటించడానికి ఓ పదినిముషాల వ్యవధి ఉందనగా ఓ యువకుడు నా దగ్గరకువచ్చాడు.

చామనచాయ రంగు, బాగా బలంగా, ఎత్తుగా, ఓ మాదిరి లావుగా ఉన్నాడు. జీన్స్ ప్యాంట్, వైట్ టీషర్ట్, ట్రిమ్‌గా షేవ్‌చేసి అల్లరిగా గాల్లో ఎగురుతున్న జుట్టుని ఓ చేత్తో సవరించుకుంటూ ''హాయ్ మేడమ్'' అన్నాడు.

''హాయ్'' అన్నాను నవ్వీ నవ్వనట్లుగా సన్నగా నవ్వుతూ.

''మీ పెయింటింగ్ చాలా బాగుంది. ఇట్స్ సో ఫెంటాస్టిక్'' అన్నాడు పొగుడుతున్నట్లుగా.

''మీకేకాదు, నా పెయింటింగ్ అందరికీ నచ్చింది. ఎనీహౌ థాంక్స్ ఫర్ యువర్ కాంప్లిమెంట్'' అన్నాను.

రిజల్ట్స్ అనౌన్స్ చేస్తున్నారు.

''ఈ ఇయర్ బెస్ట్ పెయింటింగ్ మిస్టర్ ఆనంద్‌కు మార్ వేసిన పెయింటింగ్ 'వెన్నెల పూలతోటలో రాకుమారి'. ఇట్స్ రియల్లీ ఎ మార్వలెస్ పెయింటింగ్. కంగ్రాట్స్ ఫర్ ది విన్నర్. వి ఆర్ వెల్‌కమ్ టు ఆనంద్'' అంటూ మైక్‌లోంచి వినిపిస్తుంటే స్టేజీ ఎక్కుతున్న యువకుడి వంక తన్మయంగా చూసాను.

అతడే ఆనంద్. ఇందాక నాతో మాట్లాడిన యువకుడు.

అతడి మాట తీరు, నడిచే విధానం, గీసిన పెయింటింగ్ ఇలా ఎన్నన్ని చెప్పను?

అతడు మొత్తంగా నచ్చాడు. నాకే తెలియకుండా అతడిపై అభిమానం ఏర్పడింది. ఆర్ట్ కాంపిటీషన్‌లో ఫస్ట్‌ప్రైజ్ సంపాదించాలని వెళ్ళి నా మనస్సు పోగొట్టుకుని వచ్చాను. ఎప్పుడు నిద్ర పట్టిందో తెలియదు.

• • •

''మీ పేరు?'' అడిగారు నాన్నగారు.

''ఆనంద్.''

''ఏం చదువుకున్నారు?''

''బిఏ పాసయ్యాను. ఎంఏ ప్రైవేటుగా చేస్తున్నాను.''

''ఏం జాబ్ చేస్తున్నారు?''



## పెళ్లి

''ఏరా! కళ్ళులేని అమ్మాయిని చేసుకోవడానికి ఎలా ఒప్పుకున్నావురా?'' అడిగాడు రమేష్.

''ఆ అమ్మాయికి కళ్ళు లేకుంటేనేం. అందమైన ముగ్గురు చెల్లెళ్ళున్నారు'' అసలు విషయం చెప్పాడు రాజు.

## ఏం చేయను

''ఏమయ్యా! ఇప్పటికి పదిసార్లు దొంగతనం చేస్తూ పట్టుబడ్డావు. సిగ్గుగాలేదూ?'' అన్నాడు జడ్జి.

''ఏం చేయను యువరానర్! నేను వేసిన ప్లాన్స్ అన్నీ విఫలమైపోతున్నాయి'' బాధగా చెప్పాడు ముద్దాయి.

## వరం

''నీకు దేవుడు ప్రత్యక్షమైతే ఏం కోరుకుంటావ్?'' అడిగాడు భర్త.

''ఓ పది పట్టుచీరలు, ఓ బంగారు వడ్డాణం కావాలని కోరుకుంటానండీ'' చెప్పింది భార్య.

## శిక్ష

''నీకు ఉరిశిక్ష ఖాయమైంది. నీ చివరి కోరిక ఏదైనా వుంటే చెప్పు?'' అడిగాడు జైలరు.

''నా కేసును వాదించిన లాయర్‌కు పదేళ్ళ కఠిన కారాగార శిక్ష విధించండి'' అన్నాడు ముద్దాయి.

## కథ

''అమ్మా! ఒక కథ చెప్పవా?'' అడిగాడు కొడుకు.

''మీ నాన్నగారు వచ్చే టైమైంది. ఆయన చెబుతారులే విందువుగాని'' అంది తల్లి.

- శ్రీనివాస్ వల్లాల (నారాయణఖేడ్)

అదిగో ఆ ప్రశ్న దగ్గరే ఆనంద్ తడబడతాడని ఊహించాను. ఏం చెబుతాడోనని ఆసక్తిగా అతడివంకే కన్నార్పకుండా చూసాను.

ఆనంద్ ఓసారి నావంక చూసి ఏమాత్రం తడబడకుండా సమాధానం చెప్పాడు.

''ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలో బుకింగ్ క్లర్క్‌గా పని చేస్తున్నాను. నెలకి పద్దెనిమిదివందలు జీతం.''

నాన్నగారు అతడికేసి పరిశీలనగా చూస్తూ-

''మా అమ్మాయి బిఎస్సీ కంప్యూటర్స్ చదివింది. నెలకి ఐదువేల జీతం. నాకు కాబోయే అల్లుడు డాక్టరో, ఇంజనీరో రావాలని కోరుకుంటున్నాను. కానీ నీకులా ఓ సాధారణ క్లర్కుకి నా కూతుర్ని ఇవ్వడం నా మనస్సు ఒప్పుకోవడంలేదు. నేను ఇలా అంటున్నానని నువ్వేమీ ఫీల్ కావద్దు. ఆనంద్! నా స్థానంలో నువ్వున్నా ఇలాగే మాట్లాడతావు. నాకు నా కూతురంటే ప్రాణం. చూస్తూ చూస్తూ దానికి ఓ చిన్న క్లర్కుతో పెళ్లి చేయడం నాకు ఇష్టంలేదు. దయచేసి ఇక ముందెప్పుడూ నా కూతుర్ని కలవడానికి ప్రయత్నించవద్దు'' అన్నారు ఆవేశంగా.

''నాన్నగారూ!'' అంటూ నేను మాట్లాడుతుంటే-


ఆయన నావంక సీరియస్‌గా చూసారు. నేను మౌనంగా నిల్చున్నాను. ఏం చేయాలో అర్థం కాక అటు నాన్నగారి మాటలకి ఎదురుచెప్పలేక ఇటు ఆనంద్‌ని దూరం చేసుకోవడం ఇష్టంలేక ఉబికివస్తున్న కన్నీళ్లని ఆపుకోలేక ఏడ్చేసాను.

''చూడండి మూర్తిగారూ! నేనేదో కాలక్షేపానికి మీ అమ్మాయిని ప్రేమించలేదు. తన భావాలు, అభిరుచులు, ఆలోచనలు నచ్చి ప్రేమించాను. నేనేకాదు, తనూ నన్ను ప్రేమించింది. నవ్యని పెళ్లి చేసుకోవాలని, తనతో కలిసి ఏడడుగులు నడవాలని, జీవితాంతం ఆనందంగా బ్రతకాలని కోరుకుంటున్నాను. మేమిద్దరం ఒకర్ని ఒకరం ఇష్టపడ్డాం. కలిసి జీవితాన్ని పంచుకోవాలనుకుంటున్నాం. మిమ్మల్ని మా పెద్దల్ని ఎదిరించి లేచిపోవాలనుకోలేదు. మీ అందరి అనుమతితోటే మేం పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాం.''

''మిస్టర్ ఆనంద్! హద్దుమీరి మాట్లాడుతున్నావ్. అస్సలు నువ్వు ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా? కంట్రోల్ యువర్ టంగ్. నా కూతురితో లేచిపోతావా?'' అంటూ నాన్నగారు ఆవేశంగా అతనివంక చూసారు.

''మీరు నన్ను సరిగ్గా అర్థం చేసుకున్నట్లులేదు. మేము అలా చేయం అంటున్నాను.''

''ఆఫ్టరాల్ క్లర్క్‌వి. నీకు నా కూతురు కావాల్సి వచ్చిందా? వెళ్ళు. ఇంకెప్పుడూ ఇటు ప్రక్కకు రావద్దు'' అంటూ విసురుగా కుర్చీలోంచి లేచారాయన.




''సార్! నేను ఎంతో గౌరవంగా మాట్లాడుతుంటే మీరేంటి అగౌరవంగా మాట్లాడుతున్నారు? మీరు నన్ను ఆఫ్టరాల్ క్లర్క్ అన్నారు. అయినా నేను బాధపడడంలేదు. ఎందరో గొప్ప గొప్ప వాళ్ళ జీవితాన్ని పరిశీలిస్తే మీకే తెలుస్తుంది. వాళ్లందరూ అట్టడుగు స్థాయినుంచి వచ్చినవాళ్లే. ఎన్నో కష్టాలు, నష్టాలు ఓర్చుకుని పట్టుదలగా అనుకున్నది సాధించారుగానీ మీరన్నట్లుగా పుట్టుకతోనే గొప్పవాళ్ళు కాలేదు ఎవరు. అవును నేను ఆఫ్టరాల్ క్లర్క్‌నే. కానీ ఎప్పటికీ క్లర్క్‌గానే ఉండిపోతానని మీరనుకుంటున్నారేమో! నెవ్వర్! అలా ఎన్నటికీకాదు. అందరి అంచనాల్ని తారుమారు చేస్తూ నేను జీవితంలో ఎన్నో విజయాలు సాధిస్తాను. జీవితాన్ని ఓ ఛాలెంజ్‌గా స్వీకరించి ఉన్నత స్థాయికి చేరుకుంటాను. ఖచ్చితంగా చేరుకుని తీరుతాను. నిజానికి మీతో ఇంత ఓపిగ్గా మాట్లాడి ఉండేవాడ్ని కాదు గతంలో అయితే? కానీ మీరు నన్ను ఏమన్నా ఇంకా కూల్‌గా ఆలోచించి మీతో గౌరవంగా మాట్లాడగలుగుతున్నానంటే అందుకు కారణం నవ్య. తను చెప్పిన మాటల స్ఫూర్తితోనే జీవిస్తున్నాను. ఇకముందు కూడా జీవిస్తాను. వుంటాను. మళ్ళీ సాధ్యమైనంత తొందర్లో కలుద్దాం'' అంటూ కదలి వెళ్లిపోతున్న ఆనంద్‌వంకే ఆశ్చర్యంగా చూస్తుండిపోయాను ఏడుస్తున్న ఏడుపునుకూడా మరచిపోయి.

''నీవంటి క్యారెక్టర్స్ నా జీవితంలో ఎన్నో చూసాను మిస్టర్. నువ్వు చెప్పిన మాటలున్నాయి చూశావూ అవి సినిమా డైలాగ్స్‌లాగే వున్నాయి. కానీ ప్రాక్టికల్ లైఫ్‌లో అవి పని చేయవు. ముందు నిన్ను నువ్వు కంఫర్టబుల్‌గా పోషించడం నేర్చుకో. తరువాతే పెళ్లి ప్రసక్తి గురించి ఆలోచించు. నీ వయస్సులోని కుర్రాళ్ళు ప్రేమ గురించి ఆలోచించినంతగా విలువైన జీవితాన్ని గురించి ఆలోచించరు. ఇక నువ్వు వెళ్ళవచ్చు'' అన్నారాయన.

ఇంతలో అమ్మ అక్కడికి వచ్చి అంతసేపు వంటింట్లో ఉండి మా సంభాషణలు వింటున్నదల్లా ''మళ్ళీ ఓసారి ఆలోచించండి. అబ్బాయి మంచివాడిలా అనిపిస్తున్నాడు. అయినా వాళ్ళిద్దరూ ఒకర్ని ఒకరు అంతగా ఇష్టపడుతుంటే...''

అమ్మ మాటలకు అడ్డు వస్తూ-

''నీకేం తెలీదు శారదా! నువ్వు ఇంట్లోకెళ్ళు'' అంటూ కళ్ళెర్రచేసారు నాన్నగారు.

ఆ క్షణంలో ఆయన ముఖంలోని రౌద్రాన్ని చూసి నా వెన్ను జలదరించింది. భయంతో వణికిపోయాను.

''ఛీ... ఆయన కడుపున పుట్టడంకన్నా అడవిలో చెట్టునై పుట్టినా బాగుండేది. పిల్లల మనస్తత్వాన్ని అర్థం చేసుకోలేని ఈయనా ఓ తండ్రేనా?'' అనుకున్నాను. తరువాత క్రమక్రమంగా ఆయనతో మాట్లాడ్డం తగ్గించేసాను.

సాధ్యమైనంతవరకూ ఆయన ఎదురుపడకుండా తప్పించుకుని తిరగసాగాను. నాన్నగారు మాత్రం నాతో మామూలుగా మాట్లాడడానికి ప్రయత్నించేవారు. అడిగినంతవరకే సమాధానం చెప్పి ఊరుకునే

దాన్ని మాట్లాడ్డం ఇష్టం లేనట్లుగా.

• • •

నేను ఆనంద్ కలుసుకుని చాలాకాలం అయింది.

ఓరోజు... ''మేడమ్! మీకు ఫోన్'' అని ప్యూన్ చెబితే ఫోనందుకున్నాను.

'నేనమ్మా! ఆనంద్ నాన్నగారిని'' అన్నారాయన కంగారుగా. ''చెప్పండి అంకుల్! ఏంటి విషయం?'' అడిగాను. నా గుండెలో సన్నని అలజడి ఆయనేం చెబుతాడేనని. ఆ క్షణకాలంలో మనస్సులో లక్ష ప్రశ్నలు ఉదయించాయి.

''గత వారంరోజులుగా ఆనంద్ కనిపించడం లేదు'' ఆయన చెప్పిన మాట విని నా గుండె జల్లు మంది. పై ప్రాణాలు పైకే పోయినట్లనిపించింది. మన స్సును ఎవరో గట్టిగా పిండినట్లుగా బాధగా విలవిల్లా డింది. మెదడంతా అర్థంపర్థంలేని ఆలోచనలతో తల పగిలిపోతున్నట్లుగా అనిపించింది.

''ఏమైనా చెప్పాడా నవ్యా!'' అడిగారాయన దిగులుగా.

''లేదంకుల్'' అన్నాను పొడిగా. ఫోన్ పెట్టేసిన క్షణం అయింది. 'నాన్నగారు ఆ రోజు అలా మాట్లాడకపోయి వుంటే బాగుండేది. ఆనంద్‌కి ఏమయింది? ఎక్కడ వున్నాడో? ఇకపై ఆలోచించలేకపోయాను.

నిరుత్సాహంగా రెండురోజులు గడిచాయి. అతడి గురించిన సమాచారం ఏమీ అందలేదు. కనీసం వాళ్ళ నాన్నగారు కూడా ఫోన్ చేయలేదు. గజిబిజి ఆలోచనలు, అస్తవ్యస్తమైన మనస్సు.

ఏ పని చేస్తున్నా ఏదో వెలితి. ఏదో విలువైనది పోగొట్టుకున్నట్లుగా ఉంది. ఏ పనిమీద ధ్యాస నిలవడం లేదు. నిరాశగా వుంది. ఆనంద్‌లేని జీవితం వ్యర్థం అనిపిస్తోంది. ఈ రోజెందుకో తొందరగా మెలకువ వచ్చింది. లేచి కూర్చుని పేపర్ చదువుతున్నాను. పేపర్ అయితే చదువుతున్నానుగానీ మనస్సు ఎక్కడో ఆలోచిస్తోంది. ఇంతలో ఫోన్ రింగయింది.

''ఫోన్ చూడు నవ్యా!'' అన్నారు నాన్నగారు పేపర్ లోంచి తల పైకెత్తకుండానే.

''హలో! నవ్య స్పీకింగ్'' అన్నాను.

''హాయ్ నవ్యా! నేను నీ ఆనంద్‌ని. వైజాగ్ నుండి మాట్లాడుతున్నాను. నీకు సర్‌ప్రైజ్ ఇద్దామని ఇన్నిరోజులుగా ఫోన్ చేయలేదు. నాకు ఇక్కడ బ్యాంక్‌లో అకౌంటెంట్‌గా జాబ్ వచ్చింది. వారంరోజుల క్రితమే పోస్టింగ్ ఆర్డర్స్ అందుకున్నాను. వెంటనే చేరాను. ఇంకో గుడ్‌న్యూస్ నేను ఎం.ఎ ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాను. రిజల్ట్స్ ఈ రోజు పేపర్లో వచ్చాయి'' అంటూ ఆనంద్ చెబుతుంటే నా సంతోషం నింగి అంచుల్ని తాకింది. పెదవులపై చిరునవ్వు రాగాలు చిగురించాయి.

''కంగ్రాట్స్ మైడియర్ ఆనంద్. హార్టీ కంగ్రాట్యులేషన్స్ ఫర్ యువర్ విక్టరీ'' అన్నాను. మనస్సు నిండా అలముకున్న చీకట్లను పారద్రోలుతూ వెలుగురేఖలు విచ్చుకుంటుంటే.

''ఉంటాను నవ్యా! సాధ్యమైనంత తొందర్లో నిన్ను కలుస్తాను.''

''బై...సీయూ ఆనంద్'' ఫోన్ పెట్టేసాను.

నేను వచ్చి నాన్నగారి ప్రక్కన కూర్చున్నాను. జరిగిందంతా చెప్పేసాను ఉండబట్టలేక ఆత్రంగా.

ఆయన నవ్వుతూ నన్ను దగ్గరకు తీసుకుని–

''నవ్యా! నాకు తెలుసురా ఆనంద్ జీవితంలో ఉన్నతస్థాయికి, ఎవరూ ఊహించలేనంత గొప్ప స్థాయికి చేరుకుంటాడని. నీ ప్రేమ విషయం తెలియగానే అతడి గురించి, వాళ్ళ కుటుంబం గురించి అంతా వాకబు చేసాను. నాకు వాళ్ళ సంబంధం నచ్చిన తరువాతే అతడ్ని మన ఇంటికి పిలిచాను.''


''మరి...'' అంటూ నేను ఏదో అడగబోతుంటే–

''నాకు తెలుసు నవ్యా నువ్వేం అడగబోతున్నావో! ఆ రోజెందుకు అలా ప్రవర్తించాననేగా? కావాలనే ఆ విధంగా ప్రవర్తించాను. అంతేగానీ మిమ్మల్ని ఇద్దర్నీ విడదీయాలని కాదు. కాస్త తీరిగ్గా కూర్చుని ఆలోచిస్తే నీకే అర్థం అవుతుంది. నేను...నేనేకాదు ఏ తండ్రైనా పిల్లలకు నష్టం, కష్టం కలిగించే నిర్ణయం ఏదీ తీసుకోరు. ఒకవేళ వాళ్ళు అలాంటి నిర్ణయం ఏదైనా తీసుకున్నారని పిల్లలు భావించినా కేవలం అది వాళ్ళ అమాయకత్వమే. నువ్వంటే నాకు ఎంతో ఇష్టం...కాదు నువ్వు నా ప్రాణం. అలాంటి నిన్ను దూరం చేసుకుంటానా చెప్పు. అతడ్ని, అతడి ప్రేమను, నిన్ను పరీక్షించాలని నేనారోజు అలా ప్రవర్తించాను. నువ్వు ఎక్కడున్నా క్షేమంగా, హాయిగా జీవించాలనే కోరుకుంటానుతప్ప నువ్వు కష్టాలపాలు కావాలని కోరుకోనుకదమ్మా. ఇదంతా నీకు మంచి జరగాలని నేను చేసిన ప్రయత్నమే. నేనేమైనా తప్పుగా నీ పట్ల ప్రవర్తించానంటే నన్ను మన్నించు నవ్యా'' అంటూ కళ్లనుంచి జారుతున్న కన్నీటిని ఆపడానికి విశ్వప్రయత్నం చేస్తూ ఆగిపోయారు.

''నన్ను క్షమించండి నాన్నగారూ! మిమ్మల్ని తప్పుగా అర్థం చేసుకుని మీతో చాలాకాలంగా మాట్లాడడం మానేశాను. నా గురించి ఇంత శ్రద్ధగా ఆలోచించి నాపట్ల ఇంత మంచి నిర్ణయం తీసుకున్నారు. నా గురించి మీరు చూపిస్తున్న ఆప్యాయతను అవగాహన చేసుకోలేకపోయిన అమాయకురాల్ని నేను. మీరేదో నాకు అన్యాయం చేసారని భావించాను. నన్ను, ఆనంద్‌ని విడదీయాలని చూసారని మీపట్ల ద్వేషాన్ని పెంచుకుని నన్ను నేను మోసం చేసుకున్నాను. ఇన్ని రోజులుగా మీతో మాట్లాడకుండా మీ మనస్సును బాధపెట్టినందుకు నన్ను క్షమించండి నాన్నగారూ! రియల్లీ ఐయామ్ సారీ డాడీ'' ప్రేమగా ఆయన్ని అల్లుకుపోయాను.

★

## మొదటి నక్షత్ర పరిశోధకశాల



మొట్టమొదటి నక్షత్ర పరిశోధకశాలని మద్రాసులో ప్రారంభించారు. భారతదేశంలో ఖగోళశాస్త్రం, భూగోళం, నౌకాయానం అభివృద్ధి చేయడానికి 1792వ సంవత్సరంలో ఈస్టిండియా కంపెనీవారు దీన్ని మద్రాస్‌లో స్థాపించారు. ఈ మద్రాసు అబ్జర్వేటరీ సుమారు వంద సంవత్సరాలకుపైగా అపూర్వ పరిశోధనలను కావించింది. అప్పటి ప్రభుత్వ ఖగోళ శాస్త్రజ్ఞుడైన టైలర్ 1844వ సంవత్సరంలో 11,000 నక్షత్రాలను ఖగోళంలో గుర్తించి క్యాటలాగును తయారు చేసాడు. ఇక్కడనుండే భారతదేశంలో కనిపించే సూర్యగ్రహణాలు పరిశీలింపబడ్డాయి. క్రమక్రమంగా సోలార్ ఫిజిక్స్ (సౌర భౌతిక శాస్త్రం) అభివృద్ధి చేయబడింది. ఉష్ణ ప్రదేశాలలో ఖగోళ పరిశోధనలకు 19వ శతాబ్దం ప్రారంభంలో కొడైకెనాల్ అబ్జర్వేటరీ స్థాపించబడింది. 1901వ సంవత్సరంలో ఎవర్‌షెడ్ అనే ఖగోళ శాస్త్రజ్ఞుడు సూర్యబింబంలో వర్తులం మధ్య కనిపించే మచ్చలను పరిశీలించి కొడైకెనాల్ అబ్జర్వేటరీకి ప్రపంచ ప్రఖ్యాతి కలిగించాడు. ఆ తరువాత కొడైకెనాల్ నుంచి ఖగోళ శాస్త్రజ్ఞులు ఉత్తర ఆర్కాటు జిల్లా వాణియంబాడి దగ్గర జవ్వాది కొండలమీద వున్న కావలూరుకు తరలివచ్చారు. ఇక్కడే ప్రపంచంలో అతి ఎక్కువ శక్తివంతమైన దూరదర్శిని ఏర్పాటు చేయబడింది. ఆసియాలోకెల్లా పెద్దదైన ఈ దూరదర్శిని ఖగోళ శాస్త్రంలో భారతదేశం సాధించిన గత వైభవాన్ని గుర్తు చేస్తుంది.

-సింధు

